# సాహితీ కెరటాలు

## ఎవరు కన్నీరు కారుస్తున్నా

మనం మానవులం
ఎవరికే కష్టం వచ్చినా
ఆదకోవాల్సిన వాళ్ళం
ఎవరు కన్నీరు కారుస్తున్నా
కొంగుతో తుడువాల్సిన వాళ్ళం
ఎవరు ఆకలితో అలమటిస్తున్నా
మన కంచంలోంచి ఓ ముద్ద పెట్టాల్సిన వాళ్ళం
ఎవరికే గాయం తగిలి రక్తం కారుతున్నా
మన కందువాచించి కట్టు కట్టాల్సినవాళ్ళం
ఎవరెక్కడ కడుపునొప్పితో నేలపై దొర్లుతున్నా
అర్ధరాత్రైనా బుజాలపై మోసుకెళ్ళి
ఆసుపత్రిలో చేర్చాల్సిన వాళ్ళం

చీకట్లో మగ్గుతున్న వాళ్లకు
దీపం చూపించాల్సిన వాళ్ళం
దీనులకు ధైర్యం చెప్పాల్సిన వాళ్ళం
ఆశయాల కోసం బతుకుతున్న వాళ్ళం
ఆచరణకు ప్రాధాన్యమిచ్చే వాళ్ళం
చెడును క్షాళించే వాళ్ళం
మంచిని పోషించే వాళ్ళం
విశ్వకళ్యాణం కాంక్షించే వాళ్ళం
విశ్వనరులుగా వ్యాపించే వాళ్ళం
సాటినరుల సంక్షేమం చూసేవాళ్ళం
జనగణ హితైషులం
పొరుగువాడికి సాయపడడమే
లక్ష్యమైన వాళ్ళం
నరాళితో కరాలు కలిపే వాళ్ళం
జనం కోసం జీవించేవాళ్ళం
జాతి కోసం శ్రమించే వాళ్ళం
ఎవరికే కష్టం వచ్చినా
కొంగుతో తుడువాల్సిన వాళ్ళం
మనం మానవులం
మనం మానవులం



– డా॥ తిరుగనరి,
6-17/5, డి.నగర్, చింతల్ (హెచ్ఎంటి)
హైదరాబాద్-500 054. సెల్: 9392465475

## ఈ.. మంటలార్పండి!

మంటలార్పండి
ఈ మంటలార్పండి
ఈ ధరల మంటలార్పండి
నేతల్లారా-
సెగలే కాని మంటలు కన్పించని
మా గుండె మంటల నార్పండి
మా ఆకలి మంటలే నార్పండి
మీమీ మహోన్నత కంచుకోటల్ని దాటి
ఒకసారి రండి!
మా ఈ వాస్తవ ప్రపంచంలోకి...
మా బతుకులు ఎపుడో
మాంసాలకీ, గుడ్లకీ, చేపలకీ
నీళ్ళొది లేశాయ్-
మేం ఒకటో అర తినే కూరగాయలిపుడు
వంద యాభై గ్రాముల్లోకి
వచ్చేశాయ్-
మేం ఆబగా తినే అన్నం, పప్పు దినుసలు
గంజి నీళ్ళూ
ఇక నుండి ప్రసాదంలా
నాలుక్కి రాసుకునే రోజులిచ్చేశాయ్-
దిగి రండి పాలకుల్లారా
ఓ సారి ఈ మా వాస్తవ ప్రపంచంలోకి..
మా కూలీ నాలీ బతుకులు
మా మధ్య తరగతి బతుకులు
మా కొట్టు మిట్టాడే బతుకులు
అనుక్షణం మా గుండెల అందాలిండా
కష్టాలూ కన్నీళ్ళూ నిండిన బతుకులు
గుర్తించండి-
మీమీ ఊహా ప్రపంచాల నుండి
మామా వాస్తవ ప్రపంచాలలోకి
ఈమా ధరల మంటల్లోకి...
ఆడుగిడండి...
మేం ఎలా బతకాలో
మేం ఎలా చావాలో
మీరే చెప్పండి..



– వి. సూర్యారావు
గాయత్రి మెటల్ స్టోర్సు,గాంధీబొమ్మ దగ్గర,
అనకాపల్లి-531 001. సెల్: 9246612505

## నేను

నేనే, నేను
ఆకాశంలోకి రివ్వున దూసుకెళ్తాను
సప్త సముద్రాలను అవలీలగ దాటుతాను
ఎతైన పర్వతాలను చకచక ఎక్కేస్తాను
అడవులను అణువణువున గాలిస్తాను
నదులను చేపల్లా ఈదేస్తాను
కాదేదీ నా కసాధ్యం
రాదేదీ నా కవాంతరం
కొండలను పిండి చేయటంలో నా చేయుంది
భవంతుల నిర్మాణంలో నా చేయుంది
భావి పౌరుల తయారీలో నా చేయుంది
ఆటపాటలు నేను లేకుండా
ముందుకు ఉరకవు
వర్తకం, వాణిజ్యంలో నేనూ
వైద్యం, విద్య నాదే
రక్తికి, భక్తికి ముక్తికి నేనే
నేనే నేనే భారత స్త్రీని

– డా॥ గుడిపెల్లి అనిత,
ఇ.నెం.1-8-29, సిఎంఆర్ హై స్కూల్ దగ్గర,
సీతారాంపూర్, పాత బోయిన్‌పల్లి,
హైదరాబాద్- 500 009. సెల్: 9849272449

## ప్రజలు మెచ్చిన జానపదాలు

జానపదం అంటే పల్లె. అందులో ఉండేవారు జానపదులు. జానపదాలు వస్తు రూపంలో భావరూపంలో, ప్రదర్శన రూపంలో ఉంటాయి. జానపదాలు పల్లెవాసుల నాల్కలపై పురుడు పోసుకున్న సంగీతనాదాలు శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీకలు.

జీవితంలోని బాధలను, ఆనందాలను పాటలుగా మలిచి మనసులను రసానంద భరితం చేసే రసహృదయులు జానపదులు. వీరు కన్నీటి బతుకులను కమ్మని పాటగా మలిచే సృజన శీలురు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు వీరిపదాలు నిలువెత్తు నిదర్శనాలు. జానపదుల నుండి జాలువారే గీతాలు వారి బ్రతుకు చిత్రాన్ని ప్రత్యక్షం చేస్తాయి.

**సక్కని సిరిబండ మీద - నా సామి**
**సెక్కదంచే మామ కొడక**
**సెక్క వచ్చీ సెంపదాకే - నా సామి**
**సెప్పరానీ దుక్క మొచ్చే**

ఈ పాట పని చేసేటప్పుడు మనసులోని మాటను పాట రూపంలో అభివ్యక్తీకరించడం జరిగింది. ఇది శృంగార గేయం. ఈ పాట పుట్టడానికి కారణమైన వాతావరణంలో పరిస్థితుల్ని పాట వింటున్న వ్యక్తి ఊహించుకోవాలి. బావ మీద మరదలు వలపు బాణాలే ఈ పాట. తెలంగాణలో కాబోయే భర్తను జానపదులు 'సామి' అని కూడా పిలుసుకుంటారు. దానికి చక్కని ఉదాహరణే ఈ పాట. గ్రామీణులు పంటను తెచ్చి ఆరబోసే బండలను "సిరిబండ" అని అంటారు. 'సిరి' అనగా సంపద అనేక రకాల పంట గింజలను ఆ బండ మీద ఆరబోస్తారు కాబట్టి 'సిరిబండ' అని ఆమె ప్రస్తావించింది. ఆ సిరి బండ మీద ఏదో ఒక చెక్క దంచుతుంటే చెక్క వచ్చి చెంపను తాకిందని, దుక్కమొచ్చిందని, మనసు ఉంటే తనను కలుసుకొమ్మనే ప్రేమ భావాలను తెలుపుతుంది.

జానపదులు వినియోగించే ప్రతి వస్తువు మీద పాట కట్టుకుంటారు.

**గడ్డ మీద రేడియ్యో పెట్టి**
**గడ్డి కోస్తుంటె తమ్ముత్తుర మామో**

ఈ పాట రేడియో కొత్తగా వచ్చిన కాలం కావచ్చు రేడియో చంకనేసుకొని వ్యవసాయ దారులు పొలాల్లోకి, సెలకలకు వెళ్ళేవారు. ఈనాడు మనం సెల్‌ఫోన్ తీసుకెళ్లినట్టుగానే, రేడియోను గడ్డ మీద పెట్టి పాటలు వింటూ తాము చేస్తున్న పనిలోని ఒత్తిడిని మరచిపోయే వారు. దుగం, వరం, తెలంగాణాలో గడ్డ అని కూడా అంటారు. ఈ పాటలో కోడలు మామను ప్రేమతో 'అరే' 'గమత్తురా మామ' అని చక్కగా సంబోధిస్తుంది. ఈ పాట పల్లవిలో చక్కని ప్రాస పదాలు కలిసి ఉన్నాయి.

మరమగ్గాలు రాక పూర్వం చేనేత జానపదుల్ని అలరించింది. తమకు మనసైన వాటి మీద జానపద కవి పాటను కట్టుకొన్నాడు.

**చీరలంటె చీరలాయె**
**చీర మీద సిలకాలయె**
**చిలకలు ఎవ్వరి పాలమ్మో**
**మెల్లగ నడువు నీలమ్మ**

అనేక వందల సం॥రాల నుండి మనం చేనేత వస్త్రాలు మన గ్రామీణులు నేసేవారు ఆ వస్త్రాల మీద అందమైన రంగులు వేసేవారు. మరి చీర మీద చిలక వున్నదంటే అది పంచ వర్ణాలు కలిగినదై వుండాలి. ఆ చీరనేసి తన ప్రియురాలికి ఇచ్చాడు చేనేత వస్త్రనేతగాడు తను ఇష్టంగా నేసిన చీర ప్రియురాలు కట్టుకుంటే మురిసిపోయాడు మరోవైపు ఆ పిల్ల రేపు ఎవ్వరిని పెళ్ళి చేసుకుంటుందోయని ఆ సిలకలు ఎవ్వరి పాలు అవుతాయోనని తను అంతర్మథన పడుతున్నాడు ఆమె నడిచేటప్పుడు ఆ చిలకలు అందంగా కనపడాలని చక్కగా మెల్లగా నడవమని ఆమెకు ఈ పాట ద్వారా చెప్పుతున్నాడు.

పల్లెల్లో పాటలకు కరువుండదు. ప్రతి అంశంమీద పాట పుడుతూనే వచ్చింది.

**వచ్చేది ఎండాకాలం చేరేది చెట్లకింద**
**చెయ్యిదిప్పి కల్లు పొయ్యమ్మో**
**చెట్టుకింద సెంద్రమ్మా**

ఈ పాటలో గ్రామీణ ప్రజలు అమితంగా ఇష్టపడే కల్లును ఉద్దేశించి పాడినట్లుగా అవగతమవుతుంది. శీతాకాలం పూర్తికాగానే ఎండాకాలం మండుటెండల్లో కల్లుతాగడం వల్ల కూడా ఆరోగ్యంగా ఉంటామని ప్రజల నమ్మకం. అందుకే కల్లు గీసే సమయం రాక ముందే ఎంతో ఉబలాటంతో అతను ఆ కల్లు ముంతను తలుసుకొని పాడుతున్న పాట ఇది. ఇందులో కల్లు పోసే విధానం కూడా చక్కగా చెప్పబడింది. సెంద్రమ్మ అని సంబోధించడంలో అర్థం. గౌడ వాళ్ళ మగవాళ్ళు కల్లు గీసుకొస్తే కల్లు మడవల వద్ద స్త్రీలు ఉండి తాగే వారికి పోస్తారని కూడా ఈ జానపద పాటలో వ్యక్తం అవుతుంది.

జానపదులు అనేక కళారూపాల్లో పాడుకునేందుకు పాట కట్టుకొంటారు. 'కోలాటం' ఆటను కూడా పాటలు కట్టుకొని పాడటం కనిపిస్తోంది.

**" మీ ఆరు గుర్రాలు మా ఆరు గుర్రాలు**
**పండెండు గుర్రాల బగ్గిపోతంది**
**బగ్గిలో దొరసాని బిడ్డ పోతంది**
**బగ్గిలో దొరసాని బిడ్డ పోతంది**
**బద్దతో బిందెడు నీళ్ళు పోతున్నయ్"**

ఈ గుర్రాల బగ్గి పాట (బండి) చాలా విస్తృతంగా తెలంగాణలో కోలాటంలో పాడుకునే పాట ఈ పాట నైజాము కాలంలో గుర్రాల బండి ప్రధాన వాహనంగా ఉన్న పరిస్థితిని తెలియజేస్తున్నది. ఉర్దూలో బండిని బగ్గి అని అంటారు. తెలుగు భాషలో అన్యభాషా పదాలు ఎలా మిళితం అయ్యాయో జాన పదాలు పాడుకునే పాటల్లో గూడా ఈ ఉర్దూ పదాలు మిళితం అయ్యాయి.

వివాహముకు వెళ్ళేటప్పుడు పెండ్లి కూతురు వైపు నుండి మూడుబగ్గీలు, పెండ్లి కుమారుడు వైపు నుండి మూడు బగ్గీలు పోతున్నట్లు ఇక్కడ కనపడుతున్నది. అది వారి హోదాను గురించినవే పెండ్లిళ్ళ కాలం ఎండాకాలం అందుకే నీళ్లు దారి మధ్యలో దొరకకపోతే ఇబ్బంది అని ఆమెతో నీళ్ళు తీసుకుపోతున్నట్లుగా కూడా బోధపడుతుంది.

పన్నెండు గుర్రాల బండిలో వెళ్ళేస్తోమత దొరలకు భూస్వాములకు మాత్రమే ఉంటుంది. అందుకే దొరసాని బిడ్డ ఈ బండిలో ఉన్నట్టు జానపదులు చెప్పుకుంటున్నారు. గత చరిత్రకు జానపదాలు సాక్ష్యం ఇస్తున్నాయని చెప్పేందుకు నిదర్శనంగా దీన్ని పేర్కొనాలి.

జానపదాలు అసలు సిసలైన సాహిత్యానికి ప్రతిబింబాలు. అన్వేషిస్తే ఇలాంటి ప్రజలు మెచ్చిన జానపదాలు ఎన్నొ లభిస్తాయి. మనసుండాలిగాని హాయిగా పాడుకోవడానికి వీలుగా జానపదాలుంటాయి.

– మండవరాజు మల్లేశం,
గిరిప్రసాద్‌నగర్, నర్సంపేటరోడ్, మహబూబాబాద్,
వరంగల్-506 101. సెల్: 9908012561

## అమృతమూర్తి 'అమ్మ'



(కథ)

తన ప్రేమతో స్వర్గ సుఖాలు చూపించి తన ప్రేమతో అమృతధారలు కురిపిస్తుంది అమ్మ. చిన్నప్పుడు అమ్మవై నాకు నువ్వు అందించిన ప్రేమ, అనురాగం మమతలతో నిస్వార్థంగా నువ్వు నాకు చేసిన సేవలు తూచ తప్పకుండ ఇప్పుడు నేను నా బిడ్డ మహితకి చేసుకుంటూ నిన్ను తలుచుకోని క్షణము లేదు అమ్మ.

నామీద ముద్దులతో మమతల చిరు జల్లులు కురుపిస్తున్న అనుభూతినీ జ్ఞాపకాలు నన్ను అనుక్షణం వెన్నంటి నా కర్తవ్యం నన్ను ఊపేస్తోంది అమ్మ.

నువ్వు ఎక్కడ ఉన్నా నీ జ్ఞాపకాలు నీ అనురాగంతో నన్ను ఎంతో ఉన్నత శిఖారాలకు తీసుకువెళ్ళేవు

అమ్మగా నువ్వు నాకు ఉగ్గుపాలతో రంగ రించి పోసిన అప్యాయతాను రాగాభిమానాలు నేను నీ బిడ్డగా మహితకు అణువణువులోను నింపి దాన్ని నీ అంత అపురూపంగా చూచుకుంటున్నాను.

ఇదేనమ్మా నీ పెంపకములో ఉన్న మాధుర్యం. అదేనమ్మ నీ పెంపకములా ఉన్న మాధుర్యం, స్వర్గసుఖాలు అనుక్షణం నా కర్తవ్యాన్ని నాకు గుర్తు చేస్తుంది.

ఆ రోజు నువ్వు నన్ను ఎంతో ఆప్యాయంగా స్వాగతించావు ఆదరించావు. నేను అయ్యో! అమ్మ ఏమంటుందో అని కూడ ఆలోచించకుం డా అనూహ్యమైన ప్రేమని కూడ మరచిపోయి (ప్రేమ గుడ్డిదంటారు) అలాగే గుడ్డిగా నేను చేసిన పని అనురాగ్‌ని' రిజిష్టర్ మేరేజ్ చేసుకుని పట్టుబట్టలతో పూలదండలతో నీ ఆశీసుల కోసం మేము ఇద్దరం ఎంతో భయాందోళనతో మన ఇంటి తలుపు తట్టగానే నువ్వు వచ్చి మా ఇద్దరిని చూచి ఒక్కక్షణం స్థాణువై వెంటనే తేరుకుని నోరువిప్పి ఒక్కమాట కూడా మాట్లాడకుండా లోపలికి వెళ్లి హారతితో వచ్చి హారతిచ్చి, బొట్టుపెట్టి దిష్టి తీసి నీ అనన్యమైన ప్రేమతో మమ్మల్ని నవ్వుతూ లోపలికి తీసుకు వెళ్ళేవు.

నీ ప్రేమను నా ముందు మరోసారి రుజువు చేసావు. నేను నీ ప్రేమ ముందు తలదించు కునేలా చేసావు.

అమ్మా అది నీ సంస్కారానికి నిదర్శనం. ప్రేమ వివాహం చేసుకున్న జంటని ఏ తల్లి దండ్రులు ఆదరించారో చెప్పు. నువ్వు నాకు అమ్మవై నేను నీ కడుపున పుట్టడం నా అదృష్టము!

బహుశా ఇటువంటి అదృష్టం అందరికి దొరకదు. మా లాగ ప్రేమించి పెళ్ళి చేసుకుని (ఇంట్లో చెప్పకుండ) వచ్చిన వాళ్ళని ఏ తల్లి దండ్రులు ఆదరించరు. వాళ్ళకి ఎవరి ఆదరణ, సపోర్టు ఉండదు.

అంత వరకు తల్లి, దండ్రి, అక్కాచెల్లెళ్ళు, అన్న దమ్ములు, తాత, నాయనమ్మ ఇలా ఇంతమందిలో ఉండి ప్రేమించి పెళ్ళి చేసుకున్న పాపానికి ఒంటరి వాళ్ళుగా మిగిలిపోయి మానసికంగా క్రుంగి పోతారు.

అలాంటి వాళ్ళతో పోల్చుకుంటే నేను, అనురాగ్‌ఎంత అదృష్టవంతులమో చెప్పలేను మాటలలో. అమ్మా నీకు శిరస్సు వంచి మరోసారి నమస్క రిస్తున్నాను.

అమ్మా... మా పెళ్ళి అయి ఇరవై ఏళ్లు అయిపోయింది. మేము ఇద్దరమే 'మేడ్‌ఫర్ ఈచ్ అదర్‌గానే ఉంటున్నాం'.

కాని మా పిల్లల విషయంలో మేము ఓడిపోయాం అమ్మ. ఎన్నో ఆశలు కొరికలతో వాళ్ళను పెంచి చదువు సంధ్యలు చెప్పించి వాళ్ళ కాళ్ళ మీద నిలబడగలిగేలా తీర్చి దిద్దేను.

అమ్మ నాకు ఏమీ తోచడం లేదు. ఏదైనా సలహా చెప్పు మహిత కూడ కులాంతర వివాహం చేసుకుంది..చాల రోజులు మాకు చెప్పకుండా దాచింది.మా ఆఫీసులో వాళ్ళు నాకు చెప్పే వరకు తెలియదు. అది విని నాకు చెప్పలేని కోపం, హై బి.వి. వచ్చాయి. అయినా ఏమీ చేయలేని అసమర్ధత నన్ను ఆవహించింది.

అమ్మ అంటే అసమాన త్యాగమయి. అలాంటి తల్లిని కాదనె పిల్లలుంటారు. కాని పిల్లల్ని కాదనే తల్లి ఉండదంటారు.

అమ్మ! మీ అల్లుడితో విషయం చెప్పేను. ఆయన చాలా కూలుగా సమాధానం చెప్పేరు.

చూడు మమతా ఒక్కసారి వెనక్కి తిరిగి మన ప్రేమ, మన పెళ్ళి గుర్తు తెచ్చుకో, మీ అమ్మగారి సంస్కారం, ఔదార్యం గుర్తు తెచ్చుకో.

అది కాదండి నేను మా అమ్మ సంగతి తెలిసి కూడ చాల పొరపాటు చేసానని ఎంతో బాధపడుతున్నాను ఇప్పటికి. కాని ఇది చెప్పకుండా పెళ్ళి చేసుకుని ఎంత అమాయకంగా నటిస్తోందో చూడండి.

అది వచ్చి ఒక్క మాట నాతో చెప్పి ఉంటే ఇంత బాధపడేదాన్ని కాదండి. మా ఫ్రెండ్ వచ్చి చెప్పడం నా తల తీసేసినట్లు అనిపించింది అదేనండి నా బాధ.

చూడుమమతా కూల్ డౌన్! ఒక్కసారి ఆలోచించు నువ్వు, నేను ప్రేమించి పెళ్ళి చేసుకుని 20సం॥లు మనకి పెద్దలంటే ఉండే భయ భక్తులు, గౌరవాభిమానాలు ఉండేవి. కాని ఇప్పటి పిల్లలకు భయభక్తులు గౌరవాభిమానాలు లేవు. స్వతంత్రం స్వేచ్ఛ, పౌరుషాలు ఎక్కువ.

ముందు చెప్తే మనం ఒప్పుకోము అని వాళ్ళ ఆలోచన. "వివాహము చేసుకున్నాం" అంటే ఏమీ చెయ్యలేమని వాళ్ళు ఆ పని చేసారు.

వాళ్ళు చేసుకున్నది కులాంతర వివాహం. అందుకే భయపడి మనకి చెప్పకపోవడానికి కారణం కదా! ముందు మనకి చెప్పి చేసుకుంటే నువ్వు ఎస్ అనవు కదా! అందుకే వాళ్ళు భయపడి మనకు చెప్పలేదు.

నువ్వు తొందరపడి వాళ్ళు ఇంటికి వస్తే ఏమీ అనకు నీకు ఇష్టము లేకపోతే మాట్లాడకు అంతే! ఏమైనా అన్నావంటే వాళ్ళ మనసు గాయపడి ఏదైనా అఘాయిత్యము చేసుకున్నారనుకో మనం జీవితాంతం బాధపడాలి. ఈ జన రేషన్ పిల్లల సంగతి రోజూ పేపర్లలోను, టీవీలలోను చూస్తున్నాం. గుండె దిటవు చేసుకుని వాళ్ళు ఎప్పుడు వచ్చినా ఆదరంగా ఆహ్వానించు. మన గౌరవం నిలబెట్టుకోవడము అంత కంటే ఏమీ చేయలేము.

అప్పుడే వాళ్ళు పశ్చాత్తాప పడి వాళ్ళ తప్పు వాళ్ళు తెలుసుకుంటారు. మనల్ని అర్ధము చేసుకుంటారు.

సరే మమత ముందు ఆ కళ్ళు తుడుచుకుని ఫ్రెష్ అయిరా! అలా సాయి మందిరానికి వెళ్ళి అమ్మాయిని అల్లుడ్ని ఆశీర్వదించమని సాయిని కోరుకుని వాళ్ళ పేరు మీద అర్చన చేయిద్దాం అంటూ ఇద్దరు బయలుదేరారు దైవ దర్శనానికి.

ఇంటికి రాగానే ఫోను. అమ్మ మమతా విషయం అర్ధము చేసుకున్నాను. ఏమీ ఫీలు అవకు. ఏది జరిగినా అంతా మన మంచికే అనుకో.

నువ్వు కూడ ఇలా ఆలోచిస్తావని అనుకోలేదు. జరిగిపోయిన దాని గురించి బాధ పడకండి!

ఇద్దర్ని ఇంటికి ఆహ్వానించి గ్రాండ్‌గా రిసప్షన్ ఏర్పాటుచేసి అందరికి వాళ్ళను పరిచయం చేసి మీ బాధను మరచిపోండి.

మీరు ఆలోచించుకుని నాకు ఫోను చేస్తే నేను వచ్చి వాళ్లను మన సారా ఆశీర్వదిస్తానురా! బై అల్లుడ్ని అడిగేనని చెప్పు.

చూసావా మమతా మీ అమ్మగారి సంస్కారం నా బిడ్డ చెస్తే చేసింది.దాని బిడ్డ ఎందుకు చెయ్యాలి అని ఆలోచించలేదు అదే ఆమెలో ఉన్న ప్రత్యేకత. ఆమెను అభినందించకుండా ఉండలేము.

ఆమె కాలమాన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రాక్టికల్‌గా ఆలోచిస్తారు. ఎమైనా వాళ్ళను అన్నామంటే వాళ్ళు ఏమి చేసుకుంటారో అని కూడ ఆలోచించి మనకు మీ అమ్మగారు ఫోను చేసారు.అవునండి! నిజమే. ఎవరో పిలిచి మీ అమ్మాయి పెళ్ళి చేసుకుంది అని చెప్పగానే క్షణికావేశము నన్ను కుదిపేసింది. అందుకే ఆవేశంగా అలా మాట్లాడాను.ఎప్పటికి అమ్మ అంటే అమ్మేనండి. అమ్మ స్థానమే అమృతమండి. పిల్లలు ప్రేమించి పెళ్ళి చేసుకువస్తే వాళ్ళకు తల్లిదండ్రులు పూర్తి మద్దతు ఇవ్వాలి. అప్పుడు వాళ్ళు మనం కూడా హేపీగా ఉంటాము.

వాళ్ళను బాధించి, మనం బాధపడ్డం వల్ల జరిగేది అనర్ధమే. ప్రేమను అందించండి, ప్రేమను పొందండి.

– పసుమర్తి లలితా నరసింగరావు,
సెల్: 9958819013



## శ్రీశ్రీ సాహిత్య సర్వస్వానికి రాళ్లెత్తిన కూలి అనుభవాలు!

శ్రీశ్రీగారి అబ్బాయి వెంకటరమణ పెళ్లి పిలుపు వచ్చింది. 1994 ఎండా కాలం. నర్సరావుపేట దగ్గర గణపవరం పెళ్లి కూతురిది. లంకావారి ఆడపడుచు. సరిగ్గా తేది గుర్తు లేదుగానీ, ఇటువైపు నుండి నేను, అటువైపు నుండి చలసాని ప్రసాద్ చిలకలూరి పేటలో ఉన్న శ్రీ కొల్లావెంకటయ్యగారింటిలో కలిసాం. వెంకయ్యగారు పార్వతీపురం కుట్రకేసు నుండి అప్పటి ప్రధాన మంత్రితో తన ఉత్తర ప్రత్యుత్తరాల వరకు, మిగులు భూముల సర్వేల నుండీ, భూపోరాటాల వరకు ఆయన చెప్పుకుంటూ పోయారు. తర్వాత చాలా సేపటికి వచ్చిన పని చెప్పాం. చలసాని నేను డాక్టరు కొల్లా రాజమోహన్‌రావు ముగ్గురం శ్రీశ్రీ గారబ్బాయి పెళ్ళికి బయద్దేరాం.

ఆ పెళ్ళికి ముందు ఒక సనివేశం గుర్తు చేసుకోవటం అవసరం. ఏదో సినిమాలో మాదాల రంగారావు తీసిన మహా ప్రస్థానం అనుకుంటాను. ఆ చిత్రంలో శ్రీశ్రీగారు ఒక పెళ్ళి పెద్దగా వచ్చి కులాంతర వివాహాల్ని గురించి చిన్నపాటి ఉపన్యాసం చేస్తారు. ఇక వెంకట రమణ పెళ్ళి విషయానికొస్తే పక్కా వైధిక సంప్రదాయ పద్ధతిలోనే జరిగింది. శ్రీశ్రీగారినీ ఆయన పెద్దభార్య గార్ల ఫోటోలను పెళ్ళి మండపానికి ముందరి చెరోప్రక్కన వేళ్లాడదీశారు. ఈ పెళ్ళి ఇంత సంప్రదాయ పద్ధతిలో జరుగుతుందని నేనూ ఊహించుకోలేక పోయాను. అందువలన నా నోట మాట పడిపోయింది. హాజరు అయ్యాం శ్రీశ్రీగారి పట్ల ఉన్న ప్రేమాభిమానాలే ఎంతో ఓపిగ్గా అక్కడ నన్ను ఉంచాయి. ఉన్నంతసేపు నరాలు తెగుతున్న హృదయవేదనే. చెప్పేవాళ్ళు లేరు. అడిగే వాళ్ళు లేరు. శ్రీశ్రీ దృష్టి కోణానికి పూర్తి విరుద్ధంగా వారి కుటుంబ సభ్యుల స్వేచ్ఛా జీవితంలోంచి ఆ కాసేపు వారి ఆహ్వానం స్వీకరణలో భాగమైనట్టు నటించాను. కొంత మంది కుర్రవాళ్లు పుట్టుకతో వృద్ధులు అనే గీతంలో తన కొడుకు కూడా కలిసిపోతాడని శ్రీశ్రీ ఎరగడు.

చివరిగా శ్రీశ్రీ సాహిత్య సర్వస్వానికి రాళ్లెత్తిన కూలిగా కొన్ని అనుభవాలు పంచుకోగలిగాను. ఆయనలో ఎన్ని వైరుధ్యాలున్నా సాహిత్య జీవిగా మన వారికి ఒక దిశ నిర్దేశం చేసిన శక్తిగానే చూస్తాం. అలాగే ఎన్నో బలహీనతలున్నా అవి అన్నీ ఆయన సాహిత్య సృజన ముందు గడ్డి పరకలుగానే పరిగణిస్తాం. సామ్యవాద వ్యవస్థ కోసం కలలు కన్న మహాకవికి శతజయంతిని జరుపుకోవటం అంటే ప్రజల చైతన్య ప్రతీకల్ని ఎత్తి పట్టటంగానే భావిస్తాం! నాకీ నాలుగు మాటలు వ్రాసుకోను అవకాశం కలిగించిన బైస దేవదాసుగారికి ప్రత్యేక కృతజ్ఞతలు.



– సజ్జా వెంకటేశ్వర్లు,
సెల్: 9951169967

## నాడు - నేడు

నాడు బలవంతుడు
నేడు బలహీనుడు
సాధుజీవి!

నాడు అనవసరం
నేడు అనివార్యం
లంచం!

నాడు కంఠస్థం
నేడు యంత్రస్థం
చదువు!

నాడు ముక్తి
నేడు భక్తి
క్రేజ్!

నాడు ఊరు
నేడు ప్రపంచం
పరిధి!

నాడు విలాసం
నేడు నిత్యావసరం
కారు!

నాడు పుష్కలం
నేడు మృగ్యం
ప్రాణ వాయువు!

నాడు నేలపైన
నేడు నింగిలోన
ధరలు!

నాడు నాటకం
నేడు సినిమా
వినోదం!

నాడు బాణం
నేడు బాంబు
ఆయుధం!

నాడు చేదబావి
నేడు బోరుబావి
పరిణామం!

నాడు ప్రియం
నేడు చౌక
రూపాయి!

నాడు తాళపత్రం
నేడు అచ్చుయంత్రం
అభివృద్ధి!

నాడు గురుకులం
నేడు విశవిద్యాలయం
రూపాంతరం!

– డా॥ అయాచితం నటేశ్వర శర్మ,
సెల్: 94404668557

## రెక్కలు

పక్షికి
రెక్కలే చేతులు
మనిషికి
చేతులే రెక్కలు
దేని ప్రయోజనం
దానిదే

మనిషిని
సంస్కరించే స్థలాలు
రెండే రెండు
గుడి, బడి
అమ్మ ఒడిలా
రెండూ అవసరమే

గుడి ఉన్నా
దాని కన్నా
అన్ని విధాలా
బడే మిన్న
గుడిలోని దేవుడూ
బడిలోనే కదా చదివింది

పరుగెత్తాలి
పడాలి
లేవాలి
నడవాలి
అప్పుడే జీవితం
ఏమిటో తెలిసేది

కిటికీ
ఏం చేస్తుంది?
దృశ్యాన్ని
చూపిస్తుంది
చూడ్డం అనేది
కన్నుంటేనే!

లెక్కెట్టుకుంటే
ఖర్చు చెయ్యలేవు
ఖర్చు కానిది
మురుగు నీరే
మెట్టు లేని
మేడెందుకు?

కాళ్లెప్పుడూ
కిందే వుంటాయి
కళ్లే
అప్పుడప్పుడూ
తస్మాత్ జాగ్రత్త
అహం అనర్థం..



– మాధవీ సనారా,
సెల్: 9440103134

## నానీలు

జిల్లేడు మొగ్గలో
సృష్టి విచిత్రం
ఐదు ఉడుతలు
ఒక శివలింగం

ఎర్రని
చత్తిర్లను పూసింది
మందార చెట్టు
అందానికి మెట్టు

బస్సు ఉరుకుతంటే
చెట్లూ ఉరుకుతయి
బాల్యం నిండా
భావుకత

కార్మికులు చెమటతో
మట్టి పిసికారు
అంతే!
ఇటుక తయారు

కొబ్బరి కాయను
చూసినప్పుడల్లా
బద్దెన పద్యం
వద్దన్నా గుర్తుకొస్తది

– నాగిళ్ళ రమేష్,
1-1/16, గ్రా. మల్లారం,
మం॥ భీమ దేవరపల్లి,
కరీంనగర్ జిల్లా- 505 471.
సెల్: 900 0112521

## ఎడతెగని పోరాటం

కాలమనే సాలేపురుగు
అల్లిన గూడులోంచి
స్వేచ్ఛా చిహ్నాలు
తొంగి చూస్తున్నాయి
బతుకు పోరాటంలో
స్వాతంత్ర్య సమయోధులు

– మంత్రి లక్ష్మీనారాయణ,
సెల్: 9347552538

నేటినిజం చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు'గల 'నేటినిజం' 52 సంచికలు+ పోస్టల్ ఛార్జీలు కలుపుకుని సాలుసరి చందా రూ॥ 100/-.మీ ఏడాది చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా హైదరాబాద్‌లో చెల్లించేవిధంగా డి.డి. ద్వారా ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

-'నేటినిజం' తెలుగు దినపత్రిక,
ఎస్.ఆర్.టి. 74, జవహర్‌నగర్, హైదరాబాద్-20.
ఫోన్: 27662477, 27632012